క్లుప్తంగా

నిరుపేదలకు అండగా కేసీఆర్


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్

ఏన్కూరు: నిరుపేదలకు అండగా సీఎం కేసీఆర్ ఉన్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న కేసీఆర్‌ను అందరు ఆశీర్వదించాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో పోటీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రుక్మిణి, టీఆర్ఎస్ నాయకులు బాణోతు సురేష్ నాయక్, భూక్యలాలు నాయక్, మేడ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

వైరా: వైరా మండలంలో పలు ఆలయాలకు చైర్మన్ పాలక మండలి సభ్యులను సోమవారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ప్రకటించారు. వైరాలోని కోదండరామాలయం ఆలయ కమిటీ చైర్మన్‌గా వైరాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి సత్యంబాబు, సభ్యుడిగా ఏలూరి వెంకటేశ్వరరావు(అన్నదాత) రాయపూడి వెంకటేష్, తోట నాగేశ్వరరావు, కొదుమూరి భాగ్యలక్ష్మి, సంగిశెట్టి గోమతి, వాంకుడోత్ వీరన్నలు నియమితులయ్యారు. స్నానాల లక్ష్మీపురంలోని క్షీరరామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్‌గా చింతనిప్పు రాంబాబు, పాలకమండలి సభ్యులుగా చుండూరి రవి, తూము కోటేశ్వరరావు, కొండపనేని వెంకటేశ్వరరావు, మల్లు యంగలరావు, కొరివి చందర్‌రావు, బొమ్మిడాల సావిత్రి నియమితులయ్యారు. గొల్లపూడి శ్రీ పులిగొండ లక్ష్మీనరసింహా స్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా మడుపల్లి సైదా, సభ్యులుగా వీసం గుణసుందరి, మద్దిరాల నరసింహారావు, గుగ్గిళ్ల రాధాకృష్ణ, రామాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

బోనకల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీడీఓ వేణుమాదవ్ అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు పూర్వవిద్యార్థి గుడ్‌సాహెబ్ అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చలపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఓ 59ను రద్దు చేయాలి

వేంసూరు: జీఓ నంబర్ 59ను రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జీఓ కాపీలను కాల్చి నిరసన వ్యక్తం చేశారు.. 100 గజాలకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని ప్రజల వద్ద నుంచి రూ.1,100 చెల్లించుకొని, జీఓ 59 తీసుకొచ్చి పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ బాస్కర్ల వీరంరాజు, మట్టా ప్రసాద్, నల్లమోతునాని, భీమిరెడ్డి బాలకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

మధిర: మొక్కలతో స్వచ్ఛమైన గాలి లభించడమే కాక మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లెందులపాడు సమీపాన శ్రీనివాస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన నర్సరీని సోమవారం రామయ్య దంపతులు ప్రారంభించారు. మధిర సేవా సమితి అధ్యక్షుడు పల్ల పోతు ప్రసాద్ రావు పాల్గొన్నారు.

తాతా నిఖిల్‌కు నివాళులు

కొణిజర్ల: ఇటీవల బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాతా నిఖిల్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ తాతా మధు సోదరుడి కుమారుడు అయిన నిఖిల్ మృతి చెందగా పిండిప్రోలు గ్రామంలో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి సెక్షన్ పరిధిలోని సిద్దారం రోడ్ ఫీడర్‌లోని తుమ్మూరు రామారావు వీధి, బత్తుల చలమయ్యరోడ్, వెంకటేశ్వరటాకీస్ రోడ్‌లో 11కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇదేమి బడి..

- పర్యవేక్షణ కొరవడిన ప్రభుత్వ పాఠశాలలు
- కనీస మరమ్మతులు కరువు, ఇబ్బందుల్లో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


అసౌకర్యాల నడుమ ముత్తారం జెడ్పీఉన్నత పాఠశాల

ముదిగొండ: మండలంలోని పలు గ్రామాల్లోని జెడ్పీఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థలోకి చేరుకున్నాయి. దీంతో విద్యుత్, మంచినీటి సరఫరా, మూత్రశాలలు, మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థిని, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. స్కూలు ప్రహరీ కూడా కూలిపోయింది. కనీస మౌళిక వసతులు కల్పించలేకపోతున్నారు. దీంతో పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య పడిపోతుందని తెలుస్తోంది. కాగా పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం కూడా తగ్గింది. ఎక్కడ పాఠశాలలు చూసినా సమస్యలే స్వాగతం పలుకుతున్నాయి. ముత్తారం జెడ్పీఉన్నత పాఠశాలకు పూర్వం నుంచి మంచి పేరుప్రఖ్యాతలు కలిగినదిగా ఉంది. అటువంటి పాఠశాలకు ఫలితాల్లో, క్రమశిక్షణలో, లోపాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఖమ్మం ఆర్ఎంఓగా ఉండడంతో ఇక్కడ నైతిక బాధ్యత వహించేవారు కరువైయ్యారు. విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా తయారైంది. అంతేకాకుండా వనంవారికిష్టాపురం, కమలాపురం, న్యూలక్ష్మీపురం, యడవల్లి, జెడ్పీఉన్నత పాఠశాలలో 6నుంచి పదో తరగతి చదివే విద్యార్థులంతా పేద, మధ్య తరగతి విద్యార్థులే.. ప్రైమరీ స్కూల్ కూడా ఒకే ఆవరణలో ఉండడంతో క్రీడలకు అనుకూలంగా లేదు. పాఠశాల గదులకు కిటికీలు, తలుపులు లేకపోవడంతో ఆకతాయిలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఆయా పాఠశాలలకు కరెంట్, మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి వాటర్‌బాటిల్‌లను, తీసుకువస్తున్నారు. విద్యార్థులకు మూత్రశాలలు సక్రమంగా లేకపోవడంతో ఆరుబయటకు వెళుతున్నారు. విద్యారంగం పట్ల నిర్లక్ష్యం చేయకుండా సమస్యలు పరిష్కరించి మన ఊరు – మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. కానీ పనులు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 50శాతం పనులు కూడా పూర్తి కాలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి చేస్తే తప్ప పనులు పూర్తి కావని స్పష్టమౌతుంది. చాలా చోట్ల మొక్కుబడిగా పనులు ప్రారంభించి వదిలేశారు.


కూలిన పాఠశాల ప్రహరీ


బోరు నీరు తాగుతున్న విద్యార్థులు

తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం..



మాస్కూల్‌లో గదులకు తలుపులు, కిటికీలు లేవు. మూత్రశాల పనిచేయడం లేదు. ప్రహరీ కూలిపోయింది. మంచినీటికి ఇబ్బందులు పడుతున్నాం. గదుల్లో కోడిగుడ్లు, అన్నం, నిమ్మకాయలు పెట్టి భయపెట్టిన్నారు. సెలవుల్లో చెత్తా చెదారం బాగా ఉంటుంది. మాకు చదువుకోవాలంటే ఇబ్బందిగా ఉంది.

– పి.అభిరాం, 9వ తరగతి విద్యార్థి, వనంవారికిష్టాపురం

మెరుగుపరుస్తాం..



మన ఊరు – మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రెండో దఫాలో మిగిలి స్కూళ్లల్లో పనులు పూర్తి చేస్తారు. గ్రామంలో ప్రజాప్రతినిధులు సహకారంతో స్కూల్‌లో కొన్ని సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషిచేస్తాం. ఏమైనా సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. పూర్తి బాధ్యతలు మాకు లేనందున ఉన్న సమాచారం మేరకు పని చేస్తాం.

– షేక్ నాజర్, క్లస్టర్ హెచ్‌ఎం, చిరుమర్రి

అధికారులకు విన్నవించాం..



ఇప్పటికే గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చాం. కొన్ని సీసీ కెమెరాలు స్కూల్‌లో పెట్టిస్తాం. పాఠశాలల్లో సమస్యలపై పలుమార్లు అధికారులకు, జెడ్పీచైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశాం. విద్యాశాఖ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఎస్టిమేషన్ ఇవ్వడంలేదు. నిధులు మంజూరు చేయడం లేదు. పాఠశాలలో సమస్యలు చాలా ఉన్నాయి.

– తుపాకుల యలగొండస్వామి, సొసైటీ చైర్మన్, ముదిగొండ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 3వేలు పెంచి సంవత్సరం కావస్తున్నా.. పెంచిన వేతనం ఇంత వరకు ఇవ్వలేదన్నారు. కార్మికుల సమస్యలు దృష్టిలో పెట్టుకొని అసెంబ్లీ సమావేశాలలో కార్మికుల పక్షాన తమ గళాన్ని వినిపించాలని, తద్వారా వారి సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకుపోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వచ్చే అసెంబ్లీ సమావేశాలలో తప్పకుండా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రస్తావించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యుడు రవీంద్ర, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యావతి, వెంకటేశ్వరరావు, పిల్లి బుచ్చాలు, వెంకటేశ్వరరావు, రాజమ్మ, కుమారి, సూరమ్మ, లక్ష్మి, వెంకమ్మ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి


కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీలో 2014నుంచి 2023 వరకు చేపట్టిన అభివృద్ధి పనులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఏఏ నిధులు మంజూరు అయ్యాయి.. పనుల కేటాయింపు, ఖర్చు వివరాలను తెలపాలని మున్సిపల్ కమిషనర్ కె.సుజాతకు బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు సోమవారం సమాచార హక్కు చట్టం ద్వారా కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, నాగస్వామి, జె.నగేష్ ఉన్నారు.

వైఎస్ షర్మిలను కలిసిన తాళ్లూరి

కారేపల్లి : వైఎస్ షర్మిలను కారేపల్లి మండల వైఎస్సార్‌టీపీ నాయకులు తాళ్లూరి రాంబాబు సోమవారం హైద్రాబాద్‌లో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి, వైఎస్సార్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

25న.. పట్టుబడిన వాహనాలు వేలం

మధిర: ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన రెండు వాహనాలను ఈనెల 25న వేలం ద్వారా విక్రయించనున్నట్లు మధిర ఎక్సైజ్ సీఐ కె.నాగేశ్వరరావు తెలిపారు. మధిర ఎక్సైజ్ స్టేషన్‌లో 25వ తేదీన ఉదయం 11 గంటలకు అశోక్ లేలాండ్ దోస్త్ వ్యాన్, టాటా విస్టా కార్ల బహిరంగ వేలం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి


మిర్చిపంటను పరిశీలిస్తున్న కిసాన్‌సెల్ నాయకులు

కల్లూరు: నల్లకోడు సోకడంతో నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ సెల్ మండలాధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి, నాయకులు వనుకూరి నర్సింహారెడ్డి, గోసు వెంకటకృష్ణలు ప్రభుత్వాన్ని కోరారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముక్కా శేఖర్‌గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని లక్ష్మీపురం, తాళ్లూరు వెంకటాపురం గ్రామాలలో మిరప పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధిత రైతులు ఈ పంటపై పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వీరేంద్ర, సీతారాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు హామీని నెరవేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

కారేపల్లి: జిల్లాల పునర్విభజన సందర్భంగా ఖమ్మం జిల్లాకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మండలంలోని బొక్కలతండాలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులకు సంక్షేమ పథకాలు దరిచేరడం లేదన్నారు. ఇకనైనా జిల్లాలోని ఏన్కూరులో ఐటీడీఏ ఏర్పాటు చేసి గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అనంతరం గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా హట్కర్ రాంబాబు, వాంకుడోత్ వినోద్‌తో కమిటీని ఎన్నుకున్నారు. సర్పంచ్ బానోత్ భన్సీలాల్, నాయకులు భానోత్ శ్రీను, మాలోత్ బాలు, భానోత్ అశోక్, మాలోత్ పాప్యా, మాలోత్ రూప్లా, మాలోత్ శ్రీను, లాకావత్ వినోద్, వాంకుడోత్ ఆనంద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు


నగదు ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

వైరారూరల్: మండలంలోని గరికపాడు జెడ్పీహెచ్ఎస్ ఉత్తమ ప్రతిభ కనబర్చిన పదో తరగతి విద్యార్థులకు నర్మద బాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందించారు. నీరుపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆదిరాజు నర్సింహారావు తన తల్లి నర్మదభాయ్ జ్ఞాపకార్థం ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.23 వేలు అందించారు. హెచ్‌ఎం చావా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచులు కోటా ఏలీషా, వేల్పుల జయరాజు, ఎంపీటీసీ మాగంటి సుందరమ్మ, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సైదమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

చింతకాని: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని బీజేపీ యువమోర్చా మండలాధ్యక్షుడు కొండా గోపి తెలిపారు. మండలంలోని నాగులవంచ గ్లోబల్ స్కూల్‌లో ప్రధానమంత్రి మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పరీక్ష పే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి శ్రీనివాస్, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, స్కూల్ కరస్పాండెంట్ దివాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లకు హెల్త్‌కార్డులు, బీమా కల్పించాలి


నియామకపత్రాన్ని అందజేస్తున్న రామారావు

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రైవేట్ టీచర్లకు హెల్త్‌కార్డులు, రూ.5 లక్షల వరకు జీవిత బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు కోరారు. సత్తుపల్లిలో సోమవారం నూతన డివిజన్ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాన్ని బలోపేతం చేయటానికి ప్రైవేట్ టీచర్లు అందరు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రచార కార్యదర్శిగా ఎం.రాంబాబు, సత్తుపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడిగా డి.మురళీ, కార్యదర్శిగా సీహెచ్ అంజయ్య, సాంస్కృతిక కార్యదర్శి ఎస్‌కే జాని, పట్టణ కమిటీ అధ్యక్షుడిగా కె.గోపాలరావును నియమించినట్లు తెలిపారు. వీరికి నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జి.యేసుబాబు, డివిజన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, మురళీ, సతీష్, బాలకృష్ణ, రాంబాబు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ప్రభుత్వ పథకాలు


పెనుబల్లి: లబ్ధిదారులకు చెక్కు, చీర అందిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

పెనుబల్లి: రాష్ట్రంలో నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అండగా నిలుస్తున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సోమవారం పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని 85 మందికి కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు చీరలను అందించారు. అలాగే 18 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత ప్రయోజనాలు చూసే వారి వెంట కాకుండా అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికి లబ్ధిదారులు అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వియంబంజర్ బేడా బుడగ జంగం కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం రామచందర్‌రావుబంజర్‌లో నిర్వహిస్తున్న 'కంటి వెలుగు'శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, ఎంపీపీ లక్కినేని అలేఖ్య, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి, స్థానిక నాయకులు వెంకట్రావు, వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

సత్తుపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్‌ను ఆయన నివాసంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం రాత్రి పరామర్శించారు. అదే విధంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ రవిలను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, పట్టణ అధ్యక్షుడు రఫీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, అంకమరాజు, ఆనందరావు, ప్రకాశరావు, అనీల్ పాల్గొన్నారు.

టాలెంట్ స్కూల్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే..

సత్తుపల్లిరూరల్: అక్షర నిర్మాన్ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల హైద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జీకే మహామేధా టాలెంట్ టెస్ట్‌లో సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు దండమూడి లక్ష్మీదుర్గ స్టేట్ టాపర్‌గా నిలిచింది. రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతిని చక్రపు సహస్ర సాధించి సైకిల్, షీల్డ్, ప్రశంసాపత్రాన్ని బహుమతిగా పొందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పాఠశాలకు వచ్చి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జెడ్పీటీసీ రామారావు, శంకర్‌రావు, అంకమరాజు పాల్గొన్నారు.

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


మధిర: పతాకావిష్కరణ చేస్తున్న జగన్మోహన్ రావు

మధిర: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్ రావు పతాకావిష్కరణ చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సామూహిక కుంకుమ పూజలు..

సత్తుపల్లి: పట్టణంలోని గీతా మందిరంలో సోమవారం రాత్రి శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పోకూరి కృష్ణప్రసాద్, రామకృష్ణ, వనమా నరేష్, గుడిమెట్ల ప్రసాద్, జగదీష్, ఏపూరి పురుషోత్తం, అడపా తులసి, లక్ష్మి, భవ్య పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీరాజశ్యామల హోమం..


శ్రీరాజశ్యామల హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని పెద్ద వంతెన వద్దగల శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో చేపట్టిన శ్రీరాజశ్యామల సహిత దశమహావిద్య మహాయాగంలో భాగంగా సోమవారం శ్రీరాజశ్యామల హోమం, తారా హోమం, శ్రీచక్రనవావరణార్చన, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యాశాస్త్రి, తేరాల సోమయాజ మణికంఠగౌతమ్, చింతలపాటి సత్యనారాయణ, గాంధీ, ఖాజా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోడు రైతులకు హక్కు పత్రాలివ్వాలి


మెకాలకుంటలో గిరిజన సంఘం సభ్యత్వాలు అందజేస్తున్న భూక్యా వీరభద్రం

కొణిజర్ల: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం ఆటంకం కలిగించకుండా తక్షణమే సర్వే నివేదక ప్రకారం భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం మెకాలకుంటలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి మండలి ఏర్పాటు చేసి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీని నియమించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా తేజావత్ అశోక్, భూక్యా లక్ష్మణ్‌లతో 12 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ధరావత్ నంద్యానాయక్, తేజావత్ కృష్ణకాంత్, భూక్యా లచ్చిరామ్, నరేష్, రాములు, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కారేపల్లి: కంటివెలుగు శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి బి.సురేష్ తెలిపారు. కారేపల్లి మండలం మాధారం, అప్పాయిగూడెంలో శిబిరాలు నడుస్తున్నాయన్నారు. సోమవారం రెండు శిబిరాలలో 314మందికి పరీక్షలు నిర్వహించి, 134మందికి కళ్ళజోళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. 45మందికి మెరుగైన కంటి వైద్యం కోసం రిఫర్ చేసినట్లు తెలిపారు.

ముదిగొండ: మండలంలోని అమ్మపేట, ముదిగొండ గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సూర్యనారాయణ పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు.

నష్టం జరగకుండా చూడాలి

ముదిగొండ: రహదారి విస్తరణలో తమ ఇళ్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని ముదిగొండ మండల గ్రామస్తులు సోమవారం కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ముదిగొండ మండలంలోని వల్లభి, బాణాపురం, అయ్యగారిపల్లి, కమలాపురం, వనంవారికిష్టాపురం, చిరుమర్రి, న్యూలక్ష్మీపురం, ముదిగొండ సెంటర్ నుంచి వల్లభి రహదారి విస్తరణలో భాగంగా ఎడమవైపు ఉన్న గృహాలు అక్రమ కట్టడాలు అంటూ నోటీసులు ఇచ్చారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. రహదారి విస్తరణ వల్ల 50సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ ఇళ్లను కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు నష్టం జరగకుండా చూడాలని వారు కోరారు.

అలుపెరుగని పోరాట వీరుడు.. నేతాజీ

భారత స్వాతంత్ర్య సంగ్రామ పోరాటయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను సోమవారం మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం బోస్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నేతాజీ దేశం కోసం ఎంతో గొప్ప త్యాగం చేశారని, ఆయన సేవలు దేశ ప్రజలకు ఎంతగానో దోహదపడ్డాయన్నారు. ఆయన మహనీయుడని, అలుపెరుగని పోరాట వీరుడని అన్నారు. అనంతరం పేద కుటుంబాలకు క్వింటాల్ బియ్యం పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



వైరా: నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో..